అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

అదనపు కలెక్టర్ గౌతమికి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమి పూజారిని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన గౌతమికి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట కమిషనర్ మీర్జా ఫసహత్ ఆలీబేగ్, పట్టణ ప్రణాళికా అధికారి అన్సారి, మేనేజర్ రాజిరెడ్డి, డీఈ ప్రసాద్ ఉన్నారు.

తెలంగాణ జాగృతికి మోహన్ రాజీనామా

మోహన్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాగృతి జిల్లా కోశాధికారి మోహన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో దశాబ్దకాలంగా పనిచేసిన ఆయన వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు జూపల్లి నాగేందర్‌రావుకు సోమవారం సమర్పించారు.

యువ కళాకారుల ఎంపికకు దరఖాస్తులు

కలెక్టరేట్, డిసెంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ అనురాగ్ జయంతి అనుమతితో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 15 నుంచి 19 ఏండ్లు గల యువ కళాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి అజ్మీర రాందాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు ఎలాంటి రుసుము లేదని తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానం పొందిన కళాకారులను రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం పొందిన కళాకారులను జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. జానపద నృత్యం(గ్రూప్ ఫోక్ డ్యాన్స్ 1-10 మందికి మించకుండా), జానపద నృత్యం(ఫోక్ డ్యాన్స్ సోలో, ఇండివిడ్యుయల్, 5 మందికి మించకుండా), జానపద గేయం(ఫోక్ సాంగ్, గ్రూప్, 1-10 మందికి మించకుండా), జానపద గేయం(ఫోక్ సాంగ్ ఇండివిడ్యుయల్, సోలో, 5 మందికి మించకుండా), కథా రచన(స్టోరీ రైటింగ్), పోస్టర్ తయారీ, ప్రకటనలు, ఫొటోగ్రఫీ, హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఉత్సాహవంతులైన అభ్యర్థులు తమ పేర్లను కలెక్టరేట్‌లోని రెండో అంతస్తు రూం నెంబర్-19లో ఈనెల 19లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 90594 65889 సంప్రదించాలని కోరారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ డే

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 18: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం డిగ్రీ మొదటి సంవత్సర విద్యార్థుల ప్రెషర్స్‌డేను జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో హోరెత్తించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి సంవత్సర విద్యార్థినులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ సుదా సింధు, అధ్యాపక బృందం,విద్యార్థినులు ఉన్నారు.

ఎస్జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 18: ఎస్జీఎఫ్ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను ప్రదర్శించినట్లు ఆయా పాఠశాలల పీడీలు సోమవారం తెలిపారు. బొప్పాపూర్‌కు చెందిన పొన్నాల రిషిక జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా ఈ నెల 21 నుంచి 25వరకు ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పీడీ ప్రభాకర్ తెలిపారు. అలాగే వెంకటాపూర్‌కు చెందిన అంజన సౌమ్య ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ రవికుమార్ చెప్పారు. ఆమె మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో 17 నుంచి 19వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని, అదే పాఠశాలకు చెందిన కే రోహిణి అండర్-17 ఫుట్‌బాల్‌లో జాతీయస్థాయికి ఎంపికైంది. కాగా ఆమె బీహార్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం

వీర్నపల్లి, డిసెంబర్18: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర మండలంలోని వన్‌పల్లిలో సోమవారం ప్రారంభమైంది. దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో సర్వీసులు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ వంటి పథకాలతో పాటు వన్ నేషన్-వన్ రేషన్ కార్డు, ఆయుష్మాన్‌భవ కార్డుల గురించి ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఇక్కడ సర్పంచ్ జోగినిపల్లి లత, ఎంపీడీవో నరేశ్‌కుమార్, ఏపీఎం నర్సయ్య పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి మండల మండెపల్లి శివారులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపీపీ మానస, మండలాధ్యక్షుడు రాజన్న, నేతలు

గంభీరావుపేట: సీతారామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

పూజలు చేసి.. పండ్లు పంచి

- ఘనంగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ వివాహ వార్షికోత్సవ వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 18: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ -శైలిమ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఎంపీపీ పడిగెల మానస-రాజు దంపతులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో ఘనం గా జరుపుకొన్నారు. ఈమేరకు సోమవారం తంగళ్లపల్లి మండల మండెపల్లి శివారులోని ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్ ప్యా కెట్లను అందజేశారు. కేటీఆర్ -శైలిమ దంపతులు నిండు నూరేండ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వెంటే తామంతా ఉన్నామని పేర్కొన్నారు. అధికారం ఉన్న, లేకున్నా.. కేటీఆర్ వెంటే ఉంటామని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విం డో చైర్మన్లు బండి దేవదాస్ గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, మండలాధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత పడిగెల రాజు, సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీలు సిలువేరి ప్రసూన, బుస్స స్వప్న, సిలువేరి నర్సయ్య, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, గుగ్గిళ్ల ఆంజనేయులుగౌడ్, వేముల శ్రీనివాస్, చిలువేరి చిరంజీవి, ఆగంరావు, కొయ్యడ రమేశ్, ఎండీ హమీద్, సాహేద బేగం, సిరిసిల్ల పరశురాములు, అబు బకర్, నక్క ప్రేమ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, తోకల మహేశ్ తదితరులు ఉన్నారు.

రామాలయంలో రామన్న పెళ్లి రోజు వేడుకలు

గంభీరావుపేట, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని సీతారామస్వామి ఆలయంలో సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేటీఆర్-శైలిమ దంపతులు ఇలాంటి పెళ్లి రోజులు ఎన్నో జరుపుకోవాలని రామాలయంలో అర్చన చేపించారు. అలాగే బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు సిరిపురం అంజయ్య పెళ్లి రోజు వేడుకలు ఆలయంలో నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దోసల వికాస్, ఎగదండి రవి, కుశి గుంపుల కిషన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'గ్రీవెన్స్ డే'తో బాధితులకు సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- 11ఫిర్యాదులు స్వీకరణ

తెలంగాణ చౌక్, డిసెంబర్18: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందులో భాగంగా ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు ఎస్పీ స్వయంగా అందుబాటులో ఉన్న బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతా ల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారమయ్యాయో ఎప్పటికప్పు డు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారులకు దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలి

- అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్, తహసీల్దార్ షరీఫ్‌మొయినొద్దీన్ పిలుపు

కలెక్టరేట్, డిసెంబర్ 18: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేయాలని, అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్, తహసీల్దార్ షరీఫ్ మొయినొద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బూత్‌లెవల్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని సిరిసిల్లలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. వంద శాతం ఓటరు నమోదు లక్ష్యంగా, పారదర్శకతతో కూడిన జాబితా రూపొందించడం కోసం స్పెషల్ సమ్మర్ రివిజన్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు సర్వే ద్వారా నూతన నమోదు, మార్పులు, చేర్పులు, డిజిటలైజేషన్, యాప్ వినియోగం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా మాస్టర్ ట్రైనర్ పాతూరి మహేందర్‌రెడ్డి, బీల్‌వోల పాత్ర, విధులు, బాధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ ఆవురం సుధాకర్‌రెడ్డి, బంటు బాలకిషన్, సూపర్‌వైజర్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ షరీఫ్ మొయినొద్దీన్

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 18: సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన మురుగు కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట, పద్మనగర్ ప్రాంతాల మీదుగా ప్రవహించే ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో ఆమె పరిశీలించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ మీర్జా పసహత్ అలీ, కౌన్సిలర్లు దిడ్డి మాదవి, గూడూరి భాస్కర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు దిడ్డి రాజు, డీఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి ఉన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 18: మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీ. మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మరమగ్గంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ సర్పంచ్ ముక్క శంకర్, తదితరులు ఉన్నారు.

అరుణ్‌తేజకు నంది అవార్డు

వేములవాడ/వేములవాడ టౌన్, డిసెంబర్ 18: సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేస్తున్న దురిశెట్టి అరుణ్ తేజచారికి మెగా ఎంటర్‌ప్రైజెస్, వంశీ ఫిలిం చాంబర్ సౌజన్యంతో 2022-23 సంవత్సరానికి గానూ నంది అవార్డును ఆదివారం అందజేశారు. ఇప్పటివరకు 81 సార్లు రక్తదానం చేసిన అరుణ్ తేజ చారికి హైదరాబాద్ రవీంద్రభారతిలో సినీనటి సరయు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

చందుర్తి, డిసెంబర్ 18: చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఓ యువతి ఫోన్ పోగొట్టుకోగా చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ సదరు యువతికి సోమవారం సెల్‌ఫోన్ అప్పగించారు. బస్టాండ్ ప్రాంతంలో కానిస్టేబుల్ సతీశ్‌కు మొబైల్ ఫోన్ లభించింది. ఫోన్ యజమానురాలిని గుర్తించి సీఐ కిరణ్‌కుమార్ సమక్షంలో అప్పగించారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

వేములవాడ టౌన్, డిసెంబర్ 18: వేములవాడ రాజన్న దర్శనార్థం వచ్చిన భక్తులు కోడెల క్యూలైన్లలో టిక్కెట్లకోసం వేచి ఉన్న సమయంలో వేములవాడ పట్టణానికి చెందిన పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు లైమ్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు చల్లా సత్తయ్య, పొలాస రాజేందర్, సిద్ధంశెట్టి రాజేశం, మైవేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు మధు మహేశ్ తదితరులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఇల్లంతకుంట, డిసెంబర్ 18: మండల కేంద్రానికి చెందిన మూగు నాగరాజు శర్మ తల్లి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని నిరుపేద వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి, డిసెంబర్ 18: నర్సింగాపూర్‌కు చెందిన జాగిరి రవి రోజూ మాదిరిగానే వృత్తిరీత్య కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డాడు. గాయాలు కాగా వేములవాడలోని దవాఖానకు తరలించారు.